విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి: కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: సంక్రాంతి పండుగ ప్రతి ఇంటా సిరిసంపదలు కురిపించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ పండగను ఆనందంగా జరుపుకోవాలని, అందరికీ ఈ సంక్రాంతి శుభం కలిగించాలన్నారు. రైతులు వేసిన పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు.

జిల్లా ప్రజలకు జేసీ శుభాకాంక్షలు

విశాలాంధ్ర- ఏలూరు: సంక్రాంతి పండుగ ఏలూరు జిల్లాలోని ప్రతి ఒక్కరి జీవితంలో క్రొత్త వెలుగులు నింపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాల ఈ సంక్రాంతి అందరి ఇంటా కలలపంట పండించాలని ఆమె ఆకాంక్షించారు.

భోగి మంటల్లో జీవో ప్రతుల దహనం

విశాలాంధ్ర-నరసాపురం: రాష్ట్ర టీడీపీ పిలుపు మేరకు నరసాపురం కార్యలయం వద్ద భోగిమంటలు ఏర్పాటు చేసి రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన అక్రమ జీవో పత్రాలను మంటల్లో వేసి తగులబెట్టారు. వైసిపి పెత్తందారుల పాలన పోవాలి చంద్రన్న సంక్షేమ పాలన రావాలి అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి పాలనలో దాడులు దౌర్జన్యాలు పెరిగిపోయాయని దుర్మార్గపు పాలన పోయి చంద్రన్న సంక్షేమ పాలన రావాలని చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే సబ్సిడీ రుణాలతో పాటు పెళ్లి కానుక ఇతరత్రా రద్దయిన సంక్షేమ పథకాలు తిరిగి అమలు చేస్తారన్నారు. 5 కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు,టిడిపి సీనియర్ నాయకులు కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు, అధికారి అనంత రామారావు,కొప్పడ రవి,జక్కం శ్రీమన్నారాయణ, సంకు భాస్కర్ నాయుడు, మల్లాడా మూర్తి, నియోజకవర్గ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో భోగి సంబరాలు

విశాలాంధ్ర - తణుకు : పట్టణంలో శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ కళాశాలలో వాకర్స్ ఆధ్వర్యంలో భోగి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాకర్స్ అందరూ ఉత్సాహంగా పాల్గొని వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లాడ నాగరాజు, ఎలక్ట్రికల్ యూనియన్ తణుకు కార్యదర్శి బళ్ళ నాని, రావుల రాంబాబు, నల్ల గణేష్ సంకు సూర్య ధనరాజు, శ్రీనివాస్ అత్యం చంటి, వింజమూరు సుబ్రమణ్యం, సంగిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐ డబ్ల్యు)ఏలూరు ఏరియా 1వ డివిజన్ వెంకటాపురం, ఏరి యా ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. అధ్యక్షత వహించిన మహిళా సమాఖ్య ఏలూరు ఏరియా కార్యదర్శి అడగర్ల లక్ష్మి ఇందిరా మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గుల పోటీ ఘనంగా నిర్వహించామన్నారు. ఈ పోటీలలో 52 మంది పాల్గొన్నారని తెలిపారు. జడ్జిలుగా జ్ఞానైనేకితన్ ప్రిన్సిపుల్ ఆర్. డి.ప్రసాద్, జ్యోతి టీచర్, మట్ట శివ ,బేబీ వ్యవహరించారన్నారు. ఫస్ట్ ప్రైజ్ విజేత జ్యోతి, రెండోవ విజేత అఖిలా, మూడోవ ప్రైజ్ విజేత మైత్రి గెలుపొందారని, విజేతలకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



విశాలాంధ్ర - పెంటపాడు : తాడేపల్లిగూడెం రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెంటపాడు పోస్ట్ బేసిక్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు, హరిదాసుతో కరచాలనం చేయడం, గంగిరెద్దు విన్యాసాలు,చిన్నారుల కోలాటం ప్రదర్శనలతో ,ఎంతో కోలాహలంగా సాగిన సంక్రాంతి సంబరాల్లో, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సేవా సంఘం నాయకులు మాట్లాడుతూ ముగ్గుల పోటీలలో విజేతల ఎంపీక కొరకు ప్రత్యేకంగా భారతి విద్యాభవన్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్‌ను న్యాయ నిర్ణేతగా పిలిచామని. ఆయన పర్యవేక్షణలోనే మొదటి బహుమతి కె.రమాదేవి, రెండవ బహుమతి, వి. వెంకట దుర్గ, మూడవ బహుమతి ఆర్. భావనీలు గెలుపొందారు. ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి, తాడేపల్లిగూడెం కమిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొవ్వూరి నాగేంద్ర రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు నల్లిమిల్లి అంజిరెడ్డి, ఏంటి సంక్షేమ సంఘం కార్యదర్శి గుడిమెట్ల శ్రీనివాస్ రెడ్డి, మేడపాటి పల్లారెడ్డి,కర్రి సురేష్ రెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మేడపాటి చల్లా రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్ కర్రి వరహాలు రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

విశాలాంధ్ర-మండవల్లి: రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానుకొల్లు గ్రామంలో శనివారం పగిలి నాగబాబుకు అతనికి ఇద్దరు కుమార్తెలు కలరు. వీరు ఇరువురు గుడివాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో నాగబాబు భార్యకు కడుపులో నొప్పిగా ఉండటంతో ఇద్దరు కుమార్తెలు కనుకొల్లు సెంటర్కు వెళ్లి సోడా తీసుకుని తిరిగి ఇంటికి రోడ్డు ప్రక్కన నడుచుకుంటూ వెళుతుండగా ముదినేపల్లి వైపు నుండి మండవల్లి వైపుకు వస్తున్న ఏపీ 16టిఎ 5666 నంబర్ గలలారీ నడుస్తున్న వారిని గుద్ది వారిపై ఎక్కటంతో పగిళ్ల తేజస్వి (16) సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. మరో కుమార్తె దుర్గకు తలకు కుడికాలు కుడి చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. దుర్గను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం గుడివాడ వివిఆర్ ఆసుపత్రిలో చేర్చారు. నాగబాబు ఫిర్యాదుపై ఎస్ఐ సిహెచ్ఎస్ రామచంద్ర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంప్రదాయ రీతిలో కొత్తల్లుడికి స్వాగతం



విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో రాజవరం గ్రామానికి చెందిన కాకి నాగేశ్వరరావు, లక్ష్మిల కుమార్తె జోష్నాకు విజయవాడకు చెందిన చీమకుర్తి శ్రీమన్నారాయణ, దీప్తిల కుమారుడు లోకేష్ సాయిలకు వివాహం జరిగింది. సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్త అల్లుడిని ఇంటికి ఆహ్వానించి గోదావరి రుచులను పిండి వంటలతో, స్వీట్లు , ఫ్రూట్స్,జ్యూస్, వివిధ 225 రకాల తిను బండారాలతో నాగేశ్వరరావు కుమారుడు కిరణ్ కుమార్ స్వాగతం పలికారు. తెలుగు సాంప్రదాయ పద్ధతిలో గోదావరి రుచులను కొత్త అల్లుడు లోకేష్‌కు తినిపించారు. లోకేష్ మాట్లాడుతూ గోదావరి జిల్లాలో సంక్రాంతి పండుగను ఇంత సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవడం సంతోష కరమని అన్నారు.

విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ జయప్రదం చేయాలి

మారుమూడి విక్టర్ ప్రసాద్

విశాలాంధ్ర-భీమవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విజయవాడ స్వరాజ్యమైదానంలో డాక్టరు బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 19వ తేదీన ఆవిష్కరించనున్నారని రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాదు అన్నారు. స్థానిక పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ 200 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.400 కోట్లతో విజయవాడ స్వరాజ్య మైదానంలో నిర్మించిన 125 అడుగుల డా॥బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఈక్వాలిటీ ఆఫ్ లిబర్టీగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందన్నారు. విజయవాడకే సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలిచే అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రం నలమూలల నుంచి ప్రతి ఒక్కరు కుల,మత,పార్టీలకు అతీతంగా స్వచ్ఛందంగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అంబేద్కర్ భావజాలంతో పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి అందరివాడైన అంబేద్కర్ స్మృతివనాన్ని అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరిని ఆకర్షించేలా అంబేద్కర్ జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మిని థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కై లైటింగ్, ఫౌంటెన్లు, లైబ్రరీ వంటి వాటితో అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. మూడు వేల మంది కూర్చునే మల్టీపర్పస్ కన్వెన్షన్ హాలు 2000 మంది కూర్చునే ఓపెన్ థియేటర్, పదివేల పుస్తకాలతో కూడిన లైబ్రరీ, అంబేద్కర్ చరిత్రను భావితరాలకు తెలియజేసే విధంగా ఒక అద్భుతమైన గొప్ప కళాఖండాన్ని తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం వలన విజయవాడ నగరం ప్రజాదరణ పొందిన గొప్ప పర్యాటక,పుణ్య కేంద్రంగా మారబోతుందన్నారు. అటువంటి ఈ గొప్ప కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు, మహిళలు, ప్రతి ఒక్కరూ పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 19వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో పండగ వాతావరణంలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, వీటిలో రాజ్యాంగాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసులు రాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, తహశీల్దారు వై.రవి కుమార్, జిల్లా విజిలెన్స్ మానిటరీ కమిటీ మెంబర్లు చవ్వాకుల భరత్, పొన్నమండ బాల కృష్ణ, నాయకులు కోనా జోసఫ్, తాళ్ళూరు మధు, కెప్టెన్ ఎ.వీరయ్య, బిరుదుగడ్డ రమేష్, బందేల ప్రమీల, కె స్టాలిన్ రాజు, ఈది రవికుమార్, తదితర నాయకులు, నాయకామణులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల హెచ్చరికలు బేఖాతర్

జూదాలదే పైచేయి

విశాలాంధ్ర - లింగపాలెం : సంక్రాంతి సంప్రదాయాల్లో భాగంగా కోడి పందేలు, జూదాలను అరికడతామని అధికారులు జారీ చేసిన హెచ్చరికలు మాటలకే పరిమితమయ్యాయి. కోడి పందేలకు పేరుగాంచిన లింగపాలెం మండలంలోని ములగలంపాడు, కలరాయనగూడెం, శింగగూడెంలలో ఒప్పంద పందేలు భారీగా నిర్వహిస్తే ఆశన్నగూడెం, అయ్యపరాజు గూడెం, టి.సి.హెచ్.ఆర్‌పాలెంలో గ్రామస్థాయి పందేలు నిర్వహించారు. పందేలతోపాటు కోత ముక్క జూదం జోరుగా సాగింది. మూడు రోజులపాటు జూదాల నిర్వాహకులకు అడ్డు అదుపులేకుండా వీటిని కొనసాగించేందుకు సన్నాహాలు చేసుకున్నారు. భారీ సంఖ్యలో ఈ పందేలకు దూర ప్రాంతాల నుండి తరలి వచ్చారు. పందేలతోపాటు ధర్మాజీగూడెంలో చిత్తులాట జూదం భారీగా సాగింది. మొదటి రోజే దాదాపు ఈ చిత్తులాటలో 25 లక్షలు చేతులు మారినట్టు స్థానికులు తెలిపారు. ఇదిలా ఉంటే మండలంలోని పందేలరాయుళ్ళు నిడదవోలు, గణపవరం తదితర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. పందేలకు వచ్చే వారితో లింగపాలెం మండలంలో రద్దీ ఏర్పడింది. మొదటి రోజే లక్షలాది రూపాయలు పందేలలో చేతులు మారాయి. గుండాట ఆటలు భారీగా కొనసాగించారు. సంక్రాంతి సంప్రదాయం పేరిట ఈ జూద క్రీడలు నిర్వహించడంపై వీటిని వ్యతిరేకించేవారి నుంచి తీవ్రవిమర్శలు వస్తున్నాయి. ఒకవైపు రాజకీయ హడావుడి వేడివేడిగా ఉన్నప్పటికీ పందేలలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా వీటిలో పాల్గొన్నారు. మూడు రోజులపాటు పందేలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. పందేలలో అనేక వ్యాపారాలు జోరుగా సాగాయి.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి: కోనాల

విశాలాంధ్ర - తణుకు : రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ యాజమాన్య హక్కుల చట్టం రైతాంగ వ్యతిరేకం, ప్రజావ్యతిరేకమని ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఆదివారం తణుకు సీపీఐ ఆఫీసు రోడ్డులో భూ యాజమాన్య హక్కు చట్ట 512 నంబరు జీవో ప్రతులను సీపీఐ నాయకులు భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకరంగా వున్న ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈచట్టంతో గత వందేళ్ళగా ఎలాంటి రికార్డు లేని భూముల్లో చెట్టు,పుట్ట బాగుచేసుకుని వేలాది ఎకరాల్లో సాగు చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ,పేద రైతులు ఈ భూములు నుంచి నెట్టివేయబడతారన్నారు. ఈ చట్టం సామాన్య,పేద, మధ్యతరగతి ప్రజలకు వ్యతిరేకమని, ఈ చట్టం రద్దుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలులో లేని ఈ చట్టం రాష్ట్రంలో అమలులోకి తేవడం దురదృష్టకరమన్నారు. తక్షణమే ప్రజా వ్యతిరేక చట్టం రద్దు చేయాలన్నారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సీపీఐ నాయకులు డివిఎన్ హనుమంతరావు,సుడగల అప్పారావు,ఏఐటీయూసీ నాయకులు నూనె రాధాకృష్ణ,ఎం.శ్రీనివాస్,వి.గణేష్,తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కామవరపుకోట : అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం జగన్ రెడ్డి నియమించుకున్న సజ్జల రామకృష్ణారెడ్డిని చర్చలకు పంప డం వలన వారి సమస్యలు పరిష్కారం కాకపోగా సజ్జల తీరు అంగన్వాడీలను బెదిరించే విధంగా ఉన్నాయని ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షులు టీవీఎస్ రాజు విమర్శించారు. అంగన్వాడి వర్కర్లు చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా ఆయన శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. ఆకలి బాధలతో అల్లాడుతున్న అంగన్వాడీల యూనియన్ నాయకులను పిలిచి చర్చలు సఫల మయ్యే రీతిలో మాట్లాడకుండా జూలై నెల వరకు వేతనాలు పెంచలేమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జూలై నెల నాటికి ఈ ప్రభుత్వం ఉంటుందని గ్యారెంటీ ఏమిటని సజ్జలను ఏఐటీయూసీ నాయకులు సూటిగా ప్రశ్నించారు. అంగన్వాడీలను తిరిగి మళ్లీ చర్చలకు పిలిచి తమ న్యాయమైన కోరికలను పరిశీలించకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రజా తీర్పుకు జగన్ ప్రభుత్వం భంగపడక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ సీనియర్ నాయకులు బి శాంత కుమారి, డి దీప, ఎన్ మర్యారాణి, ఎస్ జగదీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కోడిపందేలు, గుండాట, మద్యం

విశాలాంధ్ర- పెంటపాడు: మండలంలో సంక్రాంతి పేరిట సాంప్రదాయం ముసుగులో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. కోడి పందాలు, గుండాట, పక్కనే ఏరులై పారుతున్నా పోలీసు యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. మద్యం రవాణా విక్రయాలు జరుగుతున్నా ఆబ్కారి శాఖ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న ఆదేశాలు నిర్వాహకులు బేఖాతరు చేశారు. దీంతో ఎప్పటిలాగే కోడి పందేలు యదేచ్ఛగా కొనసాగాయి.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనలదే అధికారం: ఎంపీ

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : వచ్చే ఎన్నికల్లో టిడిపి జనసేన అధి కారం చేపడతాయని, ఇది తథ్యమని వైసీపీ రెబల్ ఎంపీ ఎంపీ కను మూరు రఘురాం కృష్ణంరాజు అన్నారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో నన్ను నా ఊరికి ఇప్పటికీ రెండుసార్లు మాత్రమే వైసీపీ నాయకులు రానిచ్చారన్నారు. మా నానమ్మ చనిపోయినప్పుడు కనీసం పెద్ద కార్యం అప్పుడు కూడా రావడానికి వీలు లేకుండా చేసింది ఈ ప్రభుత్వం అన్నారు. ఎంపీ అయినా ఆరు నెలల తర్వాత తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి భూములను అన్యాక్రాంతం చేస్తుంటేదానిని ప్రశ్నించినందుకు, ఇసక అవకతవకలు గురించి అడిగితే నాపై రాజా ద్రోహం కేసు మోపి నా పుట్టిన రోజు రాత్రి ఏ నోటీసు ఇవ్వకుండా అరెస్టు చేయడమే కాక చిత్రహింసలకు గురిచేసి ఆనందం పొందారని తోటి ఎంపీలు, ఎమ్మెల్యేలతో నన్ను తిట్టించారని ఆవేదన చెందారు. నా ఎంపీ లాండ్స్ ద్వారా అన్ని నియోజకవర్గాల్లో కొద్దిపాటి అభివృద్ధి చేశానని, నా సామాజిక వర్గమైన నర్సాపురం, ఆచంట,ముదునూరి ప్రసాద్ రాజు,రంగనాథరాజు,వీరిద్దరూ వ్యతిరేకించారని, అయినప్పటికీ, నాతో ఉన్న కేంద్ర రైల్వే శాఖ మంత్రితో మాట్లాడి నర్సాపురం నుంచి మూడు ప్రత్యేకమైన రైళ్లను తిప్పే విధంగా చేశానన్నారు. ఇది ప్రజలందరూ గమనించాలని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో 175కు 135 స్థానాల్లో టిడిపి జనసేన విజయం సాధిస్తాయని, అలాగే కాంగ్రెస్ కూడా కొన్ని స్థానాలు గెలవనుందని ఆయన జోస్యం చెప్పారు.

ఓటమి భయంతోనే టీడీపీపై దుష్ప్రచారం

విశాలాంధ్ర -నూజివీడు టౌన్: ఓటమి భయంతోనే స్థానిక శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు టిడి పిపై దుష్ప్రచారం చేస్తున్నారని అది మానుకోవాలని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజక వర్గ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఓడిపోతానని భయంతో ఎమ్మెల్యే ప్రతాప్ టిడిపి చేపట్టిన బాబు షూరిటీ భవిష్య భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తే బాగుంటుందని అందుకు టిడిపి సహకరిస్తుందని నాయకులతో పలికారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు ముసునూరు రాజా, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి, నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, మండల క్లస్టర్ ఇంచార్జ్ యనమదల సత్యనారాయణ, అన్నే సురేష్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, కౌన్సిలర్ దాసరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా కోడి పందాలు

విశాలాంధ్ర - కైకలూరు: పల్లెలలో కోడి పందాల సందడి మొదలైంది. పోలీసుల హెచ్చరికలను సైతం పందెంరాయుళ్ళు లెక్కచేయడం లేదు. కోడిపందాలు, గుండాట, పేకాట శిబిరాలు జోరుగా సాగుతోన్నాయి. పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్న పందాల నిర్వహకులు పందెం బరులను సిద్ధం చేస్తున్నారు. పందాలకు స్థలాలు, తోటలను లీజుకు ఇచ్చే వారికి పోలీసులు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో పందాలకు సిద్దమ వుతున్న బరులను ట్రాక్టర్లతో దున్నించి ధ్వంసం చేసిన సంఘటనలు కానారాకపోవడం తో పందెం రాయుళ్ల చెల రేగి పోయారు.దీంతో కోడి పందాలతో పాటు పేకాట, గుండాట అటలతో పాటు కోట్ల రూపాయలు చేతులు మారాయి. ఎక్కువగా పందాలు జరిగే కైకలూరు మండలం చుట్టపక్కల ప్రాంతాల్లోని పందెం లు భారీగా సాగుతున్నాయి. మండలం లో నీ శ్రుంగవరప్పాడు, గుమ్మళ్ల పాడు,చటాకాయి, వద ర్లపాడు,కైకలూరు పట్టణం లో పందాలు నిర్వహించారు.ఈ క్రమంలో భారీగా కోడి కత్తులను భహిరంగంగా కోడి పందాలపై ఉన్న ఆంక్షలను సైతం నిర్వహకులు లెక్క చేయడం లేదు. కోడి పందాలు, పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించిన దాఖలాలు లేక పోవడంతో కోడి పందాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతున్నాయి.

కొల్లేరులో రెగ్యులేటర్లను నిర్మించాలి..

విశాలాంధ్ర - మండవల్లి: కొల్లేరులో రెగ్యులేటర్ నిర్మాణంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని, అదికాకుండా ఎన్ని ప్రణాళికలు రూపొందించినా అభివృద్ధి శూన్యం అని కొల్లేరు ప్రేమికుడు, సామాజిక కార్యకర్త ఎల్.ఎస్. భాస్కరరావు అన్నారు. ఆదివారం మండవల్లిలో ఆయన మాట్లాడుతూ కొల్లేరు సరస్సులో ఎప్పుడూ నీరు ఉండాలంటే ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మాణం విధిగా చేపట్టాలన్నారు. ఇప్పటికే వేసవిలో చాలా భాగం ఎండిపోతుందని, రానున్న రోజుల్లో కొల్లేరు కనుమరుగయ్యే అవకాశం ఉందన్నారు. సంవత్సరం పొడుగునా నీరులేకపోవటంతో ఇప్పటికే మత్స్య సంపద గణనీయంగా తగ్గిందన్నారు. అనేక జాతులు కనుమరుగయ్యాయన్నారు. చేపలు లేకుంటే కొల్లేటి ప్రాంతంలో నివసించే పేదలు బతుకు తెరువు ఉండబోదని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరులో మేటవేసుకున్న పూడికను తీయించడం, సరస్సులో కాలువలను తప్పించి ఉప్పుటేరులో కలపటంవంటి పనులు చేపట్టాలన్నారు. 120 జీవోతో కొల్లేరు ఆపరేషన్‌తో ఐదో కాంటూరు వరకు చెరువులను ధ్వంసం చేశారు. కొల్లేరు ఆపరేషన్కు ముందు కొల్లేరు ప్రజల జీవనోపాధి ఏప్రమాణంలో ఉందో ఆతర్వాత కూడా అలాగే ఉండేటట్లు చూడమని సుప్రీంకోర్టు సాధికార కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినప్పటికీ, 19 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం కొల్లేటి ప్రజల జీవనోపాధి అంశాన్ని గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులేటర్ల నిర్మాణానికి నిధులు కేటాయించామని, నిర్మాణం ఇదిగో అదిగో చేపడతామని ప్రకటనలు చేయటమే తప్ప, నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంవల్ల ఈనాడు కొల్లేరు పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. ఇప్పటికే కొల్లేరులో నీరు తగ్గిందని వేసవిలో ఎండిపోతుందన్నారు. కొల్లేరులో నీటి మట్టం తగ్గినప్పుడు సముద్రపు ఉప్పు నీరు కొల్లేటిలోకివస్తుంది.

కొల్లేరు సరస్సులో అనువైన చోటరెగ్యు లేటర్లను నిర్మించి ఐదుఅడుగుల నుండి ఏడు అడుగుల నీరు నిల్వకట్టడం ద్వారా కొల్లేరు సర స్సు అభివృద్ధి సాధ్యపడుతుందని, సంవత్సరం పొడుగ ునా నీరు నిల్వ ఉండటంతో మత్స్య సంపద అభివృద్ధి చెంది ప్రజల జీవనోపాధికి, వలస పక్షులకు ఆహారం సమృద్ధిగా లభిస్తుందన్నారు. ప్రభుత్వం కొల్లేరు సరస్సు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది ఏలూరు జిల్లానే అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు, అధికారులు రెగ్యులేటర్ల నిర్మాణానికి కృషి చేయాలని భాస్కరరావు విజ్ఞప్తి చేశారు.

భోగి మంటల్లో జీఓ కాపీలు దహనం

విశాలాంధ్ర -భీమవరం: ప్రజల ఆస్తుల హక్కులను హరించే కొత్త లాండ్ టైట్లింగ్ చట్టం జి.ఓ. కాపీలను భీమవరంలో సిపిఐ, ఐఎఎల్, రైతు సంఘం నాయకులు భోగి మంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ లాండ్ టైట్లింగ్ చట్టం ప్రజా వ్యతిరేక చట్టమని దీన్ని వెంటనే రద్దు చేయాలని విమర్శించారు. రద్దు చేయకపోతే పెను ఉద్యమాలు నిర్మించి పాలకుల మెడలు వంచుతామని చెల్లబోయిన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి నాయకులు ఎం.లక్ష్మిపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.వి.ఆనంద్, బి.శ్రీను, వంశీ, బాబీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయం ముసుగులో కోడిపందేలు

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలో సంక్రాంతి సంప్రదాయం ముసుగులో యథేచ్ఛగా కోడిపందాలు నిర్వహించారు. మండలంలోని టి నరసాపురం, బందంచర్ల, తిరుమల దేవిపేట, అప్పలరాజు గూడెం, బండి వారి గూడెం గ్రామాల్లో ఆదివారం కోడి పందాలు నిర్వహించారు. బెట్టింగుల రూపంలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. యువత కోడి పందాలతో పాటు పేకాట, గుండాట వంటి జూద క్రీడకు ఆకర్షితులవుతున్నారు.

యథేచ్ఛగా కోడిపందేలు

విశాలాంధ్ర-వీరవాసరం: మండలవ్యాప్తంగా ఆదివారం ఉదయం నుండి కోడి పందాలు ప్రారంభమయ్యాయి. కోడి పందాల నిర్మూల నకు ఎక్కడికక్కడ పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకున్నప్పటికీ నిర్వాహకులు మాత్రం రాజకీయ నేతల అండదండలతో పందెం బరులను సిద్ధం చేసేశారు. ప్రతి ఏడాది భోగి రోజు మధ్యాహ్నం నుండి కనుమ పండుగ వరకు కోడిపందాల నిర్వహణ యధేచ్ఛగా కొనసాగుతుంది. ఈ ఏడాది కూడా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మండలంలోని వీరవాసరం కొణితివాడ, నౌడూరు, అండలూరు, రాయకుదురు, మత్స్యపురి, మత్స్యపురి పాలెం తదితర గ్రామాల్లో ఉదయం నుండి యథేచ్ఛగా కోడిపందాలు జరుగుతున్నాయి.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - పోడూరు : మండలంలోని వేడంగిలో గ్రామ జనసేన కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 50 మంది వరకూ మహిళలు పాల్గొని ఆకర్షణీయమైన సందేశాత్మకమైన ముగ్గులను తీర్చిదిద్దారు. విజేతలైన వారికి నియోజకవర్గ సమన్వయకర్త సిద్దిరెడ్డి అప్పారావు, నియోజకవర్గ జనసేన నాయకులు శిడగం సూరి, గ్రామ సర్పంచ్ సిహెచ్ పద్మ పార్వతీ శారద ఎంపిటిసి వైవి నరసింహారావు స్థానిక నాయకులు ఇనుకొండ రంగారావు యర్రంశెట్టి పద్మారావు బొలి శెట్టి నాగ రమేష్ బహుమతులను అందజేశారు. ఎన్ వి ఎస్ శైలజ ఎర్ర్ శైలజ ఎం అరుణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. స్థానిక జనసేన టిడిపి నాయకులు కొర్రకూటి హరి, నల్లి వెంకటేశ్వరరావు, కూనపరెడ్డి శ్రీనివాస్, కొండేటి ప్రసాద్, బి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కోడిపందేలు

విశాలాంధ్ర- భీమవరం టౌన్: పట్టణంలో పలుచోట్ల కోడిపందాలు విచ్చలవిడిగా సాగాయి. పండుగ పేరుతో పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్,రెవెన్యూ సిబ్బంది, మైకులతో ఊదరగొట్టారు. అయితే మొదటి రోజే పందాలు నిర్వహిస్తుంటే పోలీస్ రెవిన్యూ సిబ్బంది అటువైపు వెళ్లకపోవటంతో పందాల నిర్వాహకులు రెచ్చిపోయారు. కోడిపందాలతో పాటు, గుండాటలు, పేకాటలు, కోసాటులు భారీగా నిర్వహించారు. ఈ శిబిరాలలో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పక్క గ్రామమైన పెదమిరంలో 18 ఎకరాల్లో భారీ బరులు ఏర్పాటు చేశారు. ఈ బరులలో విచ్చలవిడిగా మద్యం ఏరులై పారింది. ఈ బర్రెలకు ఈ రాష్ట్రంలోనే కాకుండా, ప్రక్క రాష్ట్రమైన తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో పాల్గొని రూ.లక్షల్లో పందేలు కాశారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మహిళలలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం సాంప్రదాయ బద్ధంగా జరుపుకునే సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలుగుదేశం పార్టీ కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షులు జేష్ఠ రామకృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని మహిళలకు పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడం సౌభాగ్యవతి, ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకట రమణ, మండల మహిళా అధ్యక్షులు ఆకుల అరుణ, మండల మహిళా ప్రధాన కార్యదర్శి పెండ్యాల రమాదేవి,పట్టణ మహిళా అధ్యక్షురాలు దొడ్డపనేని దుర్గాదేవి,పులపాకుల ఝాన్సీ, పట్టణ ప్రధాన కార్యదర్శి పూలపల్లి వెంకటరావు, బెల్లాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇండియన్ ఆర్మ్డ్ ఫోర్సెస్ వెటరన్స్ డే

విశాలాంధ్ర-ఏలూరు: కోటదిబ్బలోని అమర్ జవాన్ స్థూపం వద్ద ఆదివారం సాయుధ దళాల వెటరన్స్ డే ఘనంగా జరిగింది. ఫీల్డ్ మార్షల్ కె యం కరియప్ప, 1947 యుద్ధంలో భారత సైన్యాన్ని విజయపథంలో నడిపించిన భారత సైన్యం మొదటి కమాండర్-ఇన్-చీఫ్, జనవరి 14, 1953న అధికారికంగా పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ప్రతి జనవరి 14న సాయుధ దళాల వెటరన్స్ డే ని నిర్వహించుకోవడం జరుగుతుందని మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి పి బింబార్కర రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా కోటదిబ్బలోని అమర్ జవాన్ స్థూపం వద్ద దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు ఏలూరు జిల్లా మాజీ సైనికుల సంఘం నివాళులు అర్పించింది. మాజీ సైనికులు, వీరనారీలు, సీనియర్ సిటిజన్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కెకె గుప్తా గౌరవ అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఏలూరు మానవతా సభ్యులు, ఏలూరు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని చైర్మన్ జి వాసుకి శర్మ, అధ్యక్షుడు బి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పి బింబార్కర రమేష్ , ఏలూరు జిల్లా మాజీ సైనికుల సంఘం సభ్యులు నిర్వహించారు.